క్లుప్తంగా

ప్రభాకర్‌కు అభినందన



ప్రభాకర్‌ను అభినందిస్తున్న ఎస్పీ

సూర్యాపేటటౌన్ : డ్రగ్స్ నిర్మూలనపై యువతకు అవగాహన కల్పిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు రావులపాటి ప్రభాకర్‌ను ఎస్పీ నరసింహ మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు వసూళ్లలో ముందంజ

సూర్యాపేట అర్బన్ : ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు వసూళ్లలో జిల్లాలో సూర్యాపేట మున్సిపాలిటీ ముందంజలో ఉందని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ మంగళవారం విలేకరులకు తెలిపారు. సూర్యాపేట మున్సిపాలిటీలో 35,633 మంది ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేయగా 31,940 మందికి ఫీజు చెల్లించాలని సమాచారం అందజేసినట్టు చెప్పారు. ఇందులో 6,585 మంది ఫీజు చెల్లించినట్టు తెలిపారు. దీంతో రూ.20.75 కోట్లు వసూలై జిల్లాలో మొదటి స్థానంలో నిలిచినట్టు పేర్కొన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ నిబంధనల మేరకు ఇప్పటివరకు 2,472 మందికి ప్రొసీడింగ్స్ జారీ చేసినట్టు చెప్పారు. నిబంధనలను అనుసరించి అర్హత ఉన్న వారందరికీ దశల వారీగా ప్రొసీడింగ్స్ జారీ చేస్తామని తెలిపారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతో కష్టాలు

తుంగతుర్తి : ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ నిర్లక్ష్యం వహిస్తున్నందున రైతులకు కష్టాలు తప్పడంలేదని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కేంద్రాల వద్ద దాదాపు 40 రోజులనుంచి ధాన్యం పడిగాపులు కాస్తున్నారని, అకాల వర్షాలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు రమేష్, ఉప్పల నాగయ్య, పోలెపాక పరమేష్, గోపగాని వెంకన్న, నల్లబెల్లి వెంకన్న, కొండగడుపుల ఎల్లయ్య పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

నూతనకల్ : తాళ్లసింగారం శివారులో పాలేరు వాగుపై చేపడుతున్న చెక్ డ్యామ్ నిర్మాణ పనుల శంకుస్థాపనకు ఎమ్మెల్యే సామేల్ బుధవారం హాజరవుతున్నట్టు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే పర్యటనలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

అల్పాహారం అందజేత



ఆస్పత్రిలో రోగులకు అల్పాహారం అందిస్తున్న సుదర్శన్‌రెడ్డి దంపతులు

భానుపురి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం సూర్యాపేట జిల్లా శాఖ అధ్యక్షుడు నాగిరెడ్డి సుదర్శన్ రెడ్డి, అరుణ కుమారి దంపతులు కోడలు చేతనారెడ్డి జన్మదినం సందర్భంగా మంగళవారం సూర్యాపేట ఏరియా హాస్పిటల్‌లో 200మంది రోగులకు, వృద్ధులకు అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లు రాంబాబు, జిల్లా, మండల కార్యవర్గ సభ్యులు వారిని అభినందించారు.

సమ్మెను జయప్రదం చేయాలి

నూతనకల్ : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న నిర్వహించనున్న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కందాల శంకర్‌రెడ్డి కోరారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో కూసు సైదులు, పులసరి వెంకటముత్యం, జలగం గోపి, బత్తుల రవి, పంతం నాగార్జున పాల్గొన్నారు.

బడిబాట ప్రచారం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం కేంద్రంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం బడిబాట నిర్వహించారు. ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్న పిల్లల ఇళ్లకు వెళ్లి తమ పాఠశాలలో చేరాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యాబోధన అందుతుందని విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. ఈ సందర్భంగా 8మంది విద్యార్థులను కొత్తగా చేర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిహెచ్, నాగరాజు, మంజుల, యాదగిరి, రమేష్ పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

తేమ సాకుతో మిల్లర్ల దగా!

- కొనుగోలు కేంద్రాల్లో పరిశీలించి కాంటాలు వేసిన ధాన్యానికి కొర్రీలు పెడుతున్న మిల్లర్లు
- తేమ, తాలు ఉందని తూకాల్లో తరుగు
- రైతులకు ఇబ్బందులు కలిగించొద్దని అధికారులు ఆదేశిస్తున్నా మారని తీరు



జనగామలో రైస్‌మిల్లు వద్ద ఉన్న పాతర్లపహాడ్ గ్రామానికి చెందిన రైతులు మిల్లర్ల ఇష్టారాజ్యం..

ఆత్మకూర్(ఎస్) : రైతుల కోసం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం అంటూ చెప్పుకుంటున్న ప్రభుత్వాలు, అధికారులు రైస్ మిల్లర్ల దోపిడీని అరికట్టడంలో విఫలమవుతున్నారు. నెలల తరబడి ధాన్యాన్ని ఆరబోశాక.. తగినంత తేమశాతం ఉందేనే వ్యవసాయ అధికారులు కాంటా వేసేందుకు ప్రమోదిస్తున్నారు. ఆ తర్వాతే ఐకేపీ నిర్వాహకులు ధాన్యం కాంటాలు వేసి లారీలలో రైస్ మిల్లులకు తరలిస్తున్నారు. అయితే రైస్ మిల్లర్లు మాత్రం ధాన్యంలో ఇంకా తేమ ఉందంటూ తూకాల్లో కోత పెడుతూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

మిల్లర్ల ఇష్టారాజ్యం..

మండల పరిధిలోని పాతర్లపహాడ్ ఐకేపీ కేంద్రంలో సరైన తేమ శాతం ఉన్న ధాన్యానికి కాంటాలు వేసి దాదాపు 9వందల బస్తాల ధాన్యాన్ని మంగళవారం లారీలో జనగామలోని ఓ రైస్ మిల్‌కు పంపించారు. అయితే అక్కడికి వెళ్లాక కూడా మిల్లర్లు తమ ఇష్టం వచ్చినట్టు ధాన్యానికి వంకలు పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. ధాన్యంలో తేమ, తాలు ఉందని సాకుతో బస్తాకు అరకేజీ తరుగు తీస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో అధికారులు పరిశీలించి కాంటాలు వేయించిన ధాన్యానికి మిల్లర్లు తిరకాసు పెట్టడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

అధికారులు చెబుతున్నా..

రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని అధికారులు మిల్లర్లకు సూచిస్తున్నారు. అయినా మిల్లర్లు ఏ మాత్రం పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వస్తున్నాయి. మిల్లర్లు లారీక 5నుంచి 6క్వింటాల ధాన్యాన్ని అదనంగా అడుగుతున్నారని రైతులు తెలుపుతున్నారు. ముందే ఐకేపీల్లో 40 కేజీలకు 41 కేజీలు తూకం వేసి పంపిస్తుంటే.. మళ్లీ రైస్ మిల్లు తూకంలో కోత విధిస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మిల్లర్ల ఆగడాలను అరికట్టాలని, వారిపై చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు డిమాండ్ చేస్తున్నారు.

సమస్య పరిష్కరిస్తాం

పాతర్లపహాడ్ ఐకేపీ కేంద్రాల నుంచి ధాన్యంలో తేమ, తాలు పరీక్షలు చేసి సరిగా ఉంటేనే కాంటా వేసి పంపిస్తున్నాం. అయితే మిల్లర్లు రైతులను సతాయిస్తున్నారని తెలుస్తోంది. ఐకేపీ నిర్వాహకులను మిల్లుల వద్దకు పంపించి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తాం.

\- మంజుల, ఏపీఎం

తేమ ఉందని తరుగు తీస్తున్నారు



కొనుగోలు కేంద్రాల్లో 20 రోజులు ధాన్యం ఆరబోశాం. ధాన్యంలో 17శాతం తేమశాతం వచ్చిన తర్వాతనే కాంటాలు వేశారు. అయితే మిల్లులకు తరలించిన తర్వాత తేమ ఉందంటూ మళ్లీ బస్తాకు అర కేజీ చొప్పున తరుగు తీస్తామంటున్నారు. ఒక రోజు దిగుమతి చేయకుండా లారీని ఆపారు. అధికారులు చెప్పినా పట్టించుకోవడం లేదు.

\- బిక్కి సంపత్, రైతు, పాతర్లపహాడ్

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి చేయూత



చెక్కు అందజేస్తున్న ఎస్పీ నరసింహ

సూర్యాపేటటౌన్ : తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న హెడ్ కానిస్టేబుల్ రమేష్ ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులకు జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ భద్రత పథకం కింద ఎస్పీ నరసింహ మంగళవారం రూ.8లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. పోలీస్ సిబ్బంది కుటుంబాల సంక్షేమానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని తెలిపారు. చేయూత పథకం నిర్వాహకులు పోలీస్ సిబ్బంది ప్రతి నెల జీతం నుంచి విరాళం అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ నాగభూషణరావు, పోలీస్ సంఘం జిల్లా అధ్యక్షుడు రామచందర్ గౌడ్, సాయిరాం పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తాళ్లగడ్డ (సూర్యాపేట) : సూర్యాపేట మండల పరిధిలోని ఇమాంపేట మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో 2025 – 26 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ శ్రీ బీసు రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులలో ప్రతి గ్రూపుకు 40 చొప్పున మొత్తం 160 సీట్లు ఉన్నట్టు వెల్లడించారు. బుధవారం నుంచి ఈ నెల 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఎంపికైన విద్యార్థుల జాబితాను 26న ప్రకటించనున్నట్టు తెలిపారు. దరఖాస్తుకు ఎలాంటి ఫీజు లేదని, సీట్ల కేటాయింపు పదో తరగతిలో మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఇదే పాఠశాలలో చదివిన పదవ తరగతి విద్యార్థులు కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాల్సి ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 9533247792, 9959265009 నంబర్లను సంప్రదించాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తులను కళాశాల ఆఫీసులో అందజేయాలని తెలిపారు.

బాల్యంలోనే ఉత్తమ సంస్కారం నేర్పించాలి



బహుమతులతో విద్యార్థులు, పాల్గొన్న నిర్వాహకులు

సూర్యాపేట అర్బన్ : చిన్నారులకు తల్లిదండ్రులు బాల్యంలోనే చదువుతోపాటు ఉత్తమ సంస్కారాలు నేర్పించాలని శ్రీవేంకటేశ్వర దేవస్థానం ప్రధాన అర్చకుడు వేణుగోపాలాచార్యులు అన్నారు. ఆధ్యాత్మికం, వ్యక్తిత్వ వికాసంపై వేసవి సెలవుల్లో ఉచిత శిక్షణ ఇవ్వాలని, ధార్మిక సంస్థల పక్షవేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శ్రీరాముని జీవితం ఆధారంగా చిన్నారులకు నైతిక మానవతా విలువలు నేర్పాలని కోరారు. సుధాకర్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ మీలా మహదేవ్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం శిక్షణ తరగతుల కన్వీనర్లు నాగుబండి ప్రభాకర్, పర్వతం శ్రీధర్ మాట్లాడారు. 12 రోజుల పాటు జరిగిన ఈ తరగతుల్లో విద్యార్థులకు ఇతిహాస కథలు, వ్యక్తిత్వ వికాసం, యోగా, భజనలు, ఆటలు, హనుమాన్ చాలీసా, భగవద్గీత మొదలగు విషయాల్లో శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. అనంతరం విద్యార్థులకు శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు, సాహస కృత్యాలు ప్రదర్శించారు. వివిధ అంశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శ్రీ మీలా మహదేవ్, శ్రీ వేణుగోపాలాచార్యులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగుబండి రఘురాం, దేవులపల్లి ప్రశాంత్, భాస్కరాచారి, పోలా వీరభద్రరావు, భాను ప్రసాద్, ఉప్పలయ్య, సంధ్యారాణి, పుర ప్రముఖులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో మాజీమంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి మంగళవారం లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. 68 మందికి చెక్కులు అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్‌ను నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



పూజల్లో పాల్గొన్న జగదీష్ రెడ్డి, తదితరులు

కనకదుర్గమ్మ జాతరలో పూజలు

తాళ్లగడ్డ(సూర్యాపేట) : సూర్యాపేట మండల పరిధిలోని దాస్ తండాలో మంగళవారం జరిగిన కనకదుర్గమ్మ జాతరలో ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

సీఎం వ్యాఖ్యలు దురదృష్టకరం

భానుపురి : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల మనసులను తీవ్రంగా గాయపరిచేలా మాట్లాడడం దురదృష్టకరమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య మంగళవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల ప్రజల్లో బూచోళ్లుగా చిత్రీకరించే విధంగా మాట్లాడడం, వారి ఆత్మాభిమానం దెబ్బతినేలా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

అనుచిత వ్యాఖ్యలు తగవు

సూర్యాపేటటౌన్ : ఉద్యోగుల పట్ల సీఎం రేవంత్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను టీజీవో తీవ్రంగా ఖండిస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పబ్బతి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కొల్లెట్టి వేణు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల తెలంగాణ అభివృద్ధికి వ్యతిరేకం కాదని పేర్కొన్నారు.

23వరకు యంగ్ ఇండియా శిక్షణ శిబిరం



మద్దిరాలలోని ప్రభుత్వ పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంఈఓ రవికుమార్

పెన్‌పహాడ్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నుంచి ఈ నెల 23వరకు నిర్వహించే యంగ్ ఇండియా వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ నకిరేకంటి రవి అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడారు. ప్రతి రోజు ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్, షటిల్, చెస్, క్యారమ్, డ్రాయింగ్, కోలాటం అంశాలలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. సమీప పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఆసక్తి కలిగిన విద్యార్థుల పేర్లు నమోదు చేయించాలని ఆయన కోరారు. పేర్ల నమోదు చేసుకోవాల్సిన విద్యార్థులు కె.రవికుమార్ పీడీ సెల్: 94920 92702, పి.సుదర్శన్ పీఈటి సెల్: 9505550275 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

మద్దిరాల : వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ కాట్ల రవికుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని ముకుందాపురం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల బడికెళ్లు పిల్లలందరికీ ఈ శిబిరాలలో ఆటలు, పాటలు, డ్యాన్స్, మెడిటేషన్, స్పోకెన్ ఇంగ్లిష్ వంటి వివిధ అంశాలలో శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కాంప్లెక్స్ హెచ్ఎం మేడిపల్లి శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఇందిర, శోభారాణి, జగదీష్ రెడ్డి, రజిత, కర్నాకర్, సురేష్, సీఆర్పీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాగారం : వేసవిలో విద్యార్థుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత సమ్మర్ క్యాంపును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి వానం ప్రభాకర్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలోని ఈటూరు, ఫణిగిరి జెడ్పీహెచ్ఎస్‌లలో బుధవారం నుంచి ఈ నెల 23 తేదీ వరకు సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గేమ్స్, యోగా శిక్షణ తరగతులు ఉంటాయని పేర్కొన్నారు.

కొత్త నల్లా బిగించి నీటి వృథా అరికట్టరూ..



నల్లా లీకై వృథాగా పోతున్న మంచినీరు

సూర్యాపేట అర్బన్ : మండుటెండలతో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. దీంతో భూగర్భ జలాలు అడుగంటి బోర్లు వట్టిపోయి నీరు దొరకని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా సూర్యాపేట పట్టణ ప్రజలకు పలు వార్డులలో మున్సిపల్ నల్లాల ద్వారా అందించే జలాలు సరిపోవడం లేదు. దీంతో కొంతమంది ఏకంగా నల్లాలకు మోటార్లు పెట్టి మరీ నీటిని తోడుకొని వాడుకుంటున్న సందర్భాలు ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో కొన్నిచోట్ల అధికారుల నిర్లక్ష్యంతో నీటిని వృథాగా పోనిస్తున్నారు. పట్టణంలో శుద్ధి చేసిన నీరు మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా వృథాగా పోతుంది. పట్టణంలోని నిర్మల ఆస్పత్రి రోడ్డులో మున్సిపల్ వాటర్ ట్యాంక్ వద్ద పట్టణవాసుల దాహార్తిని తీర్చేందుకు రోడ్డు మీద ఒక నల్లాను ఏర్పాటు చేశారు. అయితే ఆ నల్లా దగ్గర రోజుకు వందల మంది తమ దాహార్తిని తీర్చుకుంటారు. అంతేకాకుండా క్యాన్లలో నీటిని తీసుకుపోతారు. కానీ నల్లా ట్యాపు ఎప్పుడో ఏర్పాటు చేసింది కావడంతో తుప్పు పట్టి లీకేజీ అవుతోంది. ట్యాపు పనిచేయక నిత్యం తాగునీరు వృథాగా పోతోంది. పట్టణంలో నీరు దొరకక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతుంటే మున్సిపల్ ట్యాంకు దగ్గర నల్లా లీకేజీతో నీటిని వృథాగా పోనిస్తుండడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం అని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే కొత్త నల్లా బిగించాలని, నీటి వృథాను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న రణపంగ కృష్ణ

పెన్‌పహాడ్ : హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం నాగులపాటి అన్నారం గ్రామంలో హమాలీ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం తెచ్చిన కార్మిక వ్యతిరేక విధానాలపై ఈ నెల 20న దేశ వ్యాప్తంగా సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సమ్మెకు కార్మికులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు పటేల్ లింగం, లక్ష్మయ్య, ఆనంద్, రాములు, కోల సైదులు, గురవయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులు, వర్షం.. అన్నదాతకు నష్టం



మాలిపురంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిలిచిన వర్షపు నీరు

తిరుమలగిరి : మండల కేంద్రంలో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో సోమవారం రాత్రి భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఈ వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది. ఈదురుగాలులకు ధాన్యం రాశులపై ఉన్న పట్టాలు కొట్టుకుపోయాయి. అధికారులు కావడంతో రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు. తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

బౌద్ధక్షేత్రాన్ని పరిరక్షించాలి

నాగారం : రాష్ట్రంలోనే అత్యంత ప్రసిద్ధిగాంచిన ఫణిగిరి బౌద్ధక్షేత్ర పరిరక్షణకు అధికారులు చర్యలు చేపట్టాలని బోధిసత్వ ఫౌండేషన్ అధ్యక్షుడు పులిగిల్ల వీరమల్లు కోరారు. మంగళవారం మండల పరిధిలోని ఫణిగిరిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామంలోని బౌద్ధక్షేత్రం వద్ద కొన్ని తాయిలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, దీంతో బౌద్ధ సంపదకు ముప్పు వాటిల్లే ప్రమాదముందని తెలిపారు. పోలీసులు గ్రామంలో నిత్యం పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించాలని కోరారు. బౌద్ధక్షేత్ర పరిరక్షణ కోసం కలెక్టర్, ఎస్పీ లకు వినతిపత్రం అందించినా.. వారు సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యం చేయొద్దు



మద్దిరాల : పోలుమల్లలోని కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ అమీనుద్దీన్

తాళ్లగడ్డ (సూర్యాపేట) : కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యానికి వెంటనే కాంటాలు వేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లు నాగార్జున రెడ్డి డిమాండ్ చేశారు. సూర్యాపేట మండల పరిధిలోని టేకుమట్ల, రాయినిగూడెంలో ఉన్న కొనుగోలు కేంద్రాలను మంగళవారం రైతు సంఘం కమిటీ సభ్యులతో కలిసి సందర్శించారు. కేంద్రాల్లో నెలకొన్న సమస్యల గురించి రైతులను, నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని, లారీల కొరత లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దండా వెంకటరెడ్డి, జిల్లా ఆఫీస్ బేరర్స్ మండడి రాంరెడ్డి, కందాల శంకర్ రెడ్డి, వందిని సత్యనారాయణరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

మద్దిరాల : గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలను వేగవంతం చేయాలని తహసీల్దార్ అమీనుద్దీన్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పోలుమల్ల గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. పలు రికార్డులను తనిఖీ చేసి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. 17శాతం తేమశాతం వచ్చిన ధాన్యానికి వెంటనే కాంటా వేసి లారీలలో లోడ్ చేసి మిల్లులకు తరలించాలని నిర్వాహకులను సూచించారు. కొన్నిచోట్ల నిర్వాహకులు, హమాలీలు ప్రతి ధాన్యం రాశికి బస్తా చొప్పున ధాన్యం తీసుకుంటున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, అలా తీసుకునే వారిపై చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

గంగదేవమ్మ జాతర దిష్టిపూజ మహోత్సవం



పసునూరులో జలబిందెలతో యాదవ భక్తులు

నాగారం : మండల పరిధిలోని పసునూర్ గ్రామంలో ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు జరిగే గంగదేవమ్మ జాతరను విజయవంతం చేయాలని ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మైదం నారాయణయాదవ్ కోరారు. మంగళవారం పసునూరు గ్రామంలో ఉన్న గంగదేవమ్మ గుట్ట వద్ద దిష్టి పూజ కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 18న గంపలు తీసే కార్యక్రమం, 19న బోనాలు చెల్లించే కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు ఉప్పుల వెంకన్న, తొడుసు లింగమల్లు, ఉప్పుల సైదులు, ఉప్పుల రవి, తొడుసు సతీష్, తొడుసు గంగరాజు, తులసి యాదగిరి, ఉప్పుల వీరయ్య, గణేష్, మట్టిపల్లి నర్సయ్య, ఉప్పుల లింగయ్య, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

రైతుల వివరాలు నమోదు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలోని కుమ్మరిగూడెం గ్రామంలో మంగళవారం రైతుల వివరాల నమోదు కార్యక్రమాన్ని ఏఈఓ నరేష్ సత్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆధార్ తరహాలో రైతులకు 11 అంకెలతో గుర్తింపు కార్డులు కేటాయించడానికి కేంద్ర ప్రభుత్వ ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం చేపడుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతులు రాంబాబు, సైదులు, మల్లేష్, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

కోడూరులో కొనసాగుతున్న సౌడమ్మ జాతర

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం కోడూరులో సౌడమ్మ జాతర కొనసాగుతోంది. ఈ నెల 4న ఉత్సవాలు మొదలయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం చంద్రప్రభపై వేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే పారువేట, వరదపాశం పోయడం వంటి కార్యక్రమాలు జరిపారు. కాగా వివిధ జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు. సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయం సమీపంలోని పొలాల్లో గుడారాలు వేసుకున్నారు. ఈ ఉత్సవాలకు వచ్చే భక్తులు ఉత్సవాల పూర్తయ్యే వరకు ఇక్కడే ఉండటం ఈ జాతర ప్రత్యేకత. దీంతో కోడూరు గ్రామం భక్తులతో కిటకిటలాడుతోంది. ఈ ఉత్సవాల్లో నిర్వాహకులు, యాదవ కులస్థులు, భక్తులు పాల్గొన్నారు. అర్వపల్లి ఎస్ఐ బాలకృష్ణ ఆధ్వర్యంలో ఆలయం వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆదిరెడ్డి కృష్ణారెడ్డికి నివాళి

పెన్‌పహాడ్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడిన ఆదిరెడ్డి కృష్ణారెడ్డి జీవితం సాదాసీద ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోట గోపి పిలుపునిచ్చారు. ఆదిరెడ్డి కృష్ణారెడ్డి 35వ వర్ధంతి సందర్భంగా సోమవారం రాత్రి అనాజీపురం గ్రామంలో ఆయన స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ కమిటీ సభ్యుడు వీరబోయిన రవి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం. రాంబాబు, సీపీఎం మండల కమిటీ సభ్యులు లకుమళ్ల ముత్యాలు, వెంపటి లక్ష్మయ్య, బొల్లికొండ లింగయ్య, రాములు, శివ, వెంకన్న, రాగార్, రవి, నాగరాజు, శ్రీకాంత్, పులమ్మ తదితరులు పాల్గొన్నారు.

17న విగ్రహాల ఆవిష్కరణ

నాగారం : పసునూర్‌లో ఈ నెల 17న నిర్వహించే బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణను విజయవంతం చేయాలని మాదిగ కళామండలి జిల్లా నాయకుడు ఎర్ర అనుదీప్‌కుమార్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. విగ్రహాల ఆవిష్కరణకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో మాదిగ కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు మట్టిపాక అనిల్, ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి బొజ్జ సైదులుమాదిగ, చింత వినయ్, ఎమ్మార్పీఎస్ ఉమ్మడి నల్లగొండ జిల్లా కోఆర్డినేటర్ కందుకూరి సోమన్న మాదిగ, బకరం శ్రీనివాస్ పాల్గొన్నారు.

వాహనదారులకు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి

అర్వపల్లి : వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని ఎస్ఐ సీహెచ్.బాలకృష్ణ కోరారు. మంగళవారం అర్వపల్లిలో వాహనాలను తనిఖీ చేశారు. డ్రైవర్ల వద్ద పత్రాలను పరిశీలించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలుకు పంపుతామని చెప్పారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



అర్వపల్లిలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ బాలకృష్ణ, పోలీస్ సిబ్బంది

వనసర్సరీ పరిశీలన

అర్వపల్లి : కొమ్మలలో వనసర్సరీని ఎంపీడీఓ గోపి మంగళవారం పరిశీలించారు. నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిర్వాహకులకు సూచనలు చేశారు. అలాగే గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. గ్రామంలో ప్రతిరోజూ చెత్త సేకరించాలని, మురుగు కాల్వలు శుభ్రం చేయడం వంటి పనులు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నారాయణమూర్తి పాల్గొన్నారు.



వన సర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ